సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం, 16 ఫిబ్రవరి, 2024



కొలువు సాధించారు

ఉమ్మడి జిల్లా యువకులు పట్టుపట్టి పోలీసు కొలువు సాధించారు. మారుమూల పల్లెల నుంచి కష్టాలను ఎదిరించి లక్ష్యాన్ని చేరుకున్నారు. 8లో▸



కొనసాగుతున్న నాగోబా జాతర

పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల9న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /21.1

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

రైతుల సొమ్ము కాజేశాడు!

- సొంత ఖాతాలోకి డ్రిప్ రాయితీ నిధులు
- రూ.2 కోట్లకు పైగా అక్రమాలు
- అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అకౌంట్‌లోకి మళ్లింపు
- అక్రమాలకు పాల్పడిన అధికారులపై కొరడా
- ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు
- 2019 సంవత్సరం నుంచి ఈ తతంగం



ఆదిలాబాద్‌టౌన్: ఉద్యానవన శాఖ కోట్ల రూపాయల నిధులను ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పక్కదారి పట్టించాడు.. ఆ శాఖ ద్వారా రైతులకు డ్రిప్ పంపిణీ కోసం ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతర రైతులకు 90 శాతం నిధులను ప్రభుత్వం రాయితీపై ఇవ్వగా, మిగితా 10 శాతం నిధులను రైతు డీడీ రూపంలో ఆ శాఖ అధికారులకు అందజేస్తారు. ఈ డబ్బులను ప్రభుత్వ ఖజానా, పరికరాలు అందజేసే సంస్థ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా అవుట్‌సోరిస్సింగ్ ఉద్యోగి తన సొంత ఖాతాల్లోకి ఆ డబ్బులను మళ్లిస్తున్నాడు. కోవిడ్ నుంచి రైతులకు సబ్సిడీపై పరికరాలు అందడం లేదు. దీంతో డీడీలు కట్టిన అన్నదాతలు ఉద్యానవన శాఖాధికారులను కలిసి తమ డబ్బులు ఇవ్వాలని విన్నవించారు. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు డీడీలను రైతులకు అందజేయాలని ఆదేశించారు. అయినప్పటికీ జిల్లా అధికారులు ఆ రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో ఏం జరిగిందోనని విచారణ చేపట్టారు. దీంతో అక్రమార్కుల బండారం బయట పడింది. నిధుల అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు, అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా వారిపై ఉన్నతాధికారులు కొరఢా ఝులిపించారు. గతంలో జిల్లాలో పనిచేసిన ఇద్దరు అధికారులతో పాటు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా అధికారిపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే తన సొంత ఖాతాలోకి నిధులు జమ చేసుకున్న ఓ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిపై క్రిమినల్ కేసు నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేశారు.

అసలేం జరిగిందంటే?

ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు కొన్నేళ్లుగా రాయితీపై బిందుసేద్యం పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. కోవిడ్ మహమ్మారి నుంచి రైతులకు ఈ పరికరాల పంపిణీ నిలిచిపోయింది. ఆ సమయంలో 10 శాతం నిధులు డీడీ రూపంలో చెల్లించిన రైతులకు పరికరాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఆ ప్రక్రియ నిలిచిపోవడంతో రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ విసుగుచెంది తమ డబ్బులు తిరిగి చెల్లించాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. దీంతో ఉన్నతాధికారులు రైతులకు డబ్బులు తిరిగి చెల్లించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ సదరు రైతులకు డబ్బులు చెల్లించకపోవడంతో అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఉద్యానవన శాఖకు చెందిన ముగ్గురు అధికారులు వారం రోజుల క్రితం జిల్లాకు వచ్చి ప్రైవేట్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంక్ ఖాతాలు, డబ్బులు చెల్లించిన రైతుల ద్వారా ఆరా తీశారు. సదరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆ డబ్బులను ఇటు ప్రభుత్వ ఖజానాకు, అటు ప్రైవేట్ కంపెనీల ఖాతాల్లో జమ చేయకుండా సొంత ఖాతాలోకి మళ్లించినట్లు తేల్చారు. దాదాపు రూ.2 కోట్లకు పైగా నిధులు మళ్లించినట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగి 20 ఏళ్లుగా ఈ శాఖలోనే పనిచేస్తున్నాడు. ప్రైవేట్ కంపెనీలు 10 శాతం నిధులకు సంబంధించిన డబ్బులు అడిగితే శాఖ నుంచి ఇంకా విడుదల కాలేదని చెబుతూ వారిని బుకాయిస్తున్నాడు. పూర్తిస్థాయి విచారణ చేపడితే ఎన్ని కోట్ల నిధులు అక్రమాలు జరిగాయో తేటతెల్లమవుతుందని రైతులు చెబుతున్నారు.

రికవరీ అయ్యేనా..!

రైతులకు చెల్లించాల్సిన డబ్బులతో పాటు ప్రైవేట్ వ్యాపారుల డబ్బులను పక్కదోవ పట్టించిన అక్రమార్కులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అయితే ఆ డబ్బులు ఏవిధంగా రికవరీ చేస్తారోననే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. విషయం బయటకు పొక్కడంతో డీడీలు చెల్లించిన రైతులు లబోదిబోమంటున్నారు. ఆదిలాబాద్‌తో పాటు నిర్మల్ జిల్లా రైతులు సైతం డీడీలు చెల్లించినట్లు తెలుస్తోంది. దాదాపు 4వేల మంది రైతులు డీడీలు తీసినట్లు సమాచారం. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పనిచేసినప్పటి నుంచి విచారణ చేపడితే మరింత అక్రమ బండారం బయట పడనుంది. ఎవరి పాత్ర ఎంత ఉందో తేలనుంది. కోట్లాది రూపాయలు తన ఖాతాలో జమ చేసుకుంటున్నప్పటికీ బ్యాంక్ అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా ఆ ఉద్యోగి ఖాతాలోకి మళ్లించడం వెనుక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నచిన్న పొరపాట్లతో ఖాతాదారులను ఇబ్బందులకు గురిచేస్తే బ్యాంక్ అధికారులు తరచూ ఒకే అకౌంట్‌లో లక్షల రూపాయలు జమ చేసుకుంటున్నప్పటికీ ప్రశ్నించకపోవడం గమనార్హం.

ముగ్గురు అధికారుల సస్పెన్షన్..

జిల్లా స్థాయి అధికారులపై ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేస్తూ కొరడా ఝులిపించారు. ప్రస్తుతం జిల్లా అగ్రికల్చర్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి, నిర్మల్ జిల్లా హార్టికల్చర్ అధికారిగా పనిచేస్తున్న శ్యామ్‌రావు రాథోడ్, కమిషనరేట్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుంచి తొలగించడమే కాకుండా క్రిమినల్ కేసుకు ఆదేశించారు. 2019 నుంచి ఈ అక్రమ బాగోతం జరుగుతోంది. అప్పటి నుంచి ఇప్పటివరకు పనిచేస్తున్న ముగ్గురు అధికారులను బాధ్యులను చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కార్యకలాపాలపై పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చర్యలు చేపట్టారు. ఈ అధికారులతో పాటు ఇంకా ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో విచారణ కొనసాగుతోంది. బ్యాంక్ అధికారులపై సైతం అనుమానాలు రేకెత్తుతున్నాయి. వోచర్‌పై ఆ శాఖతో పాటు ప్రైవేట్ కంపెనీల పేర్లు రాయకుండా తన ఖాతాలోకి ఏవిధంగా మళ్లించుకున్నాడనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు ఈ అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి'

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టిసావర్గాం శివారులో కొమురంభీంగూడ కాలనీవాసులకు జీవో 58 ప్రకారం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర నాయకుడు గోడం గణేశ్ పిలుపునిచ్చారు. గురువారం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లుగా కొమురం భీంగూడలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు వెంటనే పట్టాలు జారీ చేయాలని, విద్య, వైద్యం, నీటివసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద చేపట్టే మహాధర్నాకు కార్మిక కర్షకులు, ఆదివాసీలు, రైతు సంఘాల నాయకులు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

'కంది'పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ప్రోటోకాల్‌కు విరుద్ధంగా జైనథ్ మండలంలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి పదవి లేకుండా అభివృద్ధి పనులు ప్రారంభించడం ఆయన అధికార దాహానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్దన్, ఎంపీటీసీ భోజన్న, నాయకులు లింగారెడ్డి, రమేశ్, కేశవ్, శివప్రసాద్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్‌వో విష్ణువర్ధన్ బదిలీ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారి ఈ.విష్ణువర్ధన్ నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. అతని స్థానంలో నిర్మల్ జిల్లా డీపీఆర్‌వోగా పనిచేస్తున్న తిరుమలను నియమించారు. ఈ మేరకు సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి



ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ డీఎస్పీగా ఎల్.జీవన్‌రెడ్డి నియామకమయ్యారు. ప్రస్తుతం డీఎస్పీగా పనిచేస్తున్న ఉమేందర్ కొన్ని రోజులుగా సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జి డీఎస్పీగా పోతారం శ్రీనివాస్ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. హుజురాబాద్ ఏసీపీగా పనిచేస్తున్న జీవన్‌రెడ్డి బదిలీపై జిల్లాకు రానున్నారు.

20న సేవాలాల్ జయంతి వేడుకలు

కైలాస్‌నగర్: బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ఈనెల 20న అధికారికంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

విద్యార్థులను ప్రోత్సహించాలి



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆదిలాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా అత్యుత్తమ శిక్షణ అందించి ప్రోత్సహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి బాక్సింగ్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈ నెల 21, 22 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అనంతరం ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అబ్దు ల్ అఫియజబీన్ క్రీడాకారిణికి గోల్డ్ మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు రేడియో ప్రసారాలు



మాట్లాడుతున్న నౌషీ నాయక్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ప్రసార సామర్థ్యం ఉమ్మడి ఆదిలాబాద్ వరకు విస్తరించిందని కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఇంజనీర్ మాలవత్ నౌషీ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆకాశవాణి కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రం ముఖ్య కార్యక్రమాధికారి రామేశ్వర్ కేంద్రేతో కలిసి మాట్లాడారు. ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం కిలోవాట్ ప్రసార సామర్థ్యంతో ప్రారంభమైందని, జనవరి 20 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యంతో ప్రచారాలను వినిపిస్తోందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు రేడియో ప్రసారాలు వెళ్తాయని వెల్లడించారు. మొబైల్ యాప్ ప్లాట్‌ఫారం ద్వారా ప్రపంచంలో ఎక్కడినుంచైనా ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం ప్రసారాలు వినే వీలు కలిగిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 2024–25 విద్యాసంవత్సరానికిగానూ కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలి పారు. టీజీటీలో హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, పీఆర్టీ, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, స్పోర్ట్స్ కోచ్, స్టాఫ్ నర్సు, స్పెషల్ ఎడ్యుకేటర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, డాటా ఎంట్రీ ఆపరేటర్ కోసం దరఖా స్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 24న ఉద యం 8.30 గంటలకు పాఠశాలలో ఇంట ర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు adilabad.kvs.ac.in వెబ్‌సైట్‌లో, 9701481516 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ సేవాలాల్ అడుగుజాడల్లో నడవాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు హస్నాపూర్, లింగోజీతాండ, పులిమడుగు, శ్యాంపూర్, తదితర గ్రామాల్లో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఉట్నూర్‌లోని జగదాంబ ఆలయంలో భోగ్ బండార్ అనంతరం వినాయక్ చౌక్ నుంచి జీసీసీ పెట్రోల్ బంక్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రజలు మంచి మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేవాలాల్ జయంతి కమిటీ గౌరవ అధ్యక్షుడు జాదవ్ వసంత్‌రావు, అధ్యక్షుడు రాథోడ్ మహేందర్, జేఏసీ అధ్యక్షుడు నరేశ్, కార్యదర్శి బానోత్ జగన్, జాదవ్ గోపాల్‌రావు, నేతావత్ రాందాస్, పవార్ విజయ్, సుధాకర్, గణేశ్, ఈఈ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

కేసుల దర్యాప్తులో పరిశోధన కీలకం

- ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: కోర్టులో నేరస్తులకు శిక్ష శాతం పెరగాలంటే కేసుల దర్యాప్తులో నాణ్యమైన పరిశోధన నిర్వహించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం పోలీస్ అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్ సబ్ డివిజనల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో నాణ్యమైన దర్యాప్తును నిర్వహిస్తూ సాక్షాధారాలను సేకరించి జాగ్రత్తగా కోర్టులో పొందుపర్చాలన్నారు. పోక్సో కేసుల్లో బాధితుల వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో నూతన పద్ధతులను అవలంభిస్తూ చార్జిషీట్లు, విచారణ నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాలను సందర్శిస్తూ సోషల్ మీడియాలో ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు అవలంభిస్తున్న పద్ధతులను వివరించాలన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లకు వచ్చిన వెంటనే న్యాయం చేకూర్చే విధంగా విధులు నిర్వర్తించాలన్నారు. డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీఐలు కె.సత్యనారాయణ, సైదారావు, సాయినాథ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మురళి, నవీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హోంగార్డుకు ఎస్పీ అభినందనలు

జాతీయ స్థాయి హైజంప్‌లో రజత పతకం, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం సాధించిన హోంగార్డు శంకర్‌ను గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ శాలువాతో సత్కరించి ప్రశంసపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 5వ జాతీయ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో జిల్లా నుంచి పాల్గొన్న హోంగార్డు నలిగంటి శంకర్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రెండు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. మేలో థాయిలాండ్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.మురళి, తదితరులు పాల్గొన్నారు.



హోంగార్డు శంకర్‌కు ప్రశంసపత్రం ఇస్తున్న ఎస్పీ

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చదువుతో పా టు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో గల మహమ్మదీయ ఉర్దూ పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించారు. అనంత రం ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొనడంతో జీవితంలో ఏదైనా సాధించాలనే పట్టుదల విద్యార్థులు పెంపొందుతుందన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు విద్యార్థులకు ఉన్నత విద్యార్థులు, ప్రాథమిక విద్యార్థుల కేటగిరీల్లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని విజ్ఞానదర్శిని వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్ అన్నారు. విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో విజ్ఞాన యానం అనే పేరుతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మూఢనమ్మకాల ప్రభావం మహిళలపై అధికంగా ఉందని, వాటిని నిర్మూలించడమే ప్రధానలక్ష్యం అన్నారు. సభ్యులు శోభారాణి, మహమ్మద్ అలీ, మహేష్ వండర్ సైన్స్ షో నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి అశోక్, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

తీరనున్న గేటు కష్టాలు

- జిల్లా కేంద్రంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మరూ..
- రైల్వే పోర్షన్ పనులు 45 రోజుల్లోగా పూర్తి చేసేలా కార్యాచరణ
- మిగతా పనుల బాధ్యత ఆర్‌అండ్‌బీది
- పెండింగ్‌లో భూసేకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ వాసుల కల ఎట్టకేలకు సాకారం కానుంది. దీర్ఘకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న జిల్లా కేంద్రంలోని తాంసి బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యుబీ) నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ఆర్‌యూబీకి సంబంధించి పనుల టెండర్‌ను దక్కించుకున్న గుత్తేదారు గురువారం రైల్వే పోర్షన్ పనులను ప్రారంభించారు. ఇందుకోసం పంజాబ్‌చౌక్ నుంచి మార్కెట్ యార్డు గుండా సాగాల్సిన రాకపోకలను మున్సిపల్ అధికారులు నిలిపివేసి దారి మళ్లించారు. 45 రోజుల్లోగా పనులు పూర్తిచేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులు భూ సేకరణ తర్వాత మొదలు కానున్నాయి.

నేరవేరనున్న చిరకాల స్వప్నం

తాంసి బస్టాండ్ వద్ద గల రైల్వే ట్రాక్‌కు అవతల మున్సిపల్ పరిధిలోని సగానికి పైగా కాలనీలున్నాయి. వీటితో పాటు తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని 60కి పైగా గ్రామాల ప్రజలు దీని గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. మహారాష్ట్రలోని మహోర్, కిన్వట్, మాండ్వి వంటి ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రైల్వే ట్రాక్‌ను దాటి వెళ్లాల్సిందే. రైళ్లు వచ్చిన ప్రతి సారి గేట్ వేయడంతో వాహనాలు నిలిచిపోయి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభిస్తున్నాయి. ఎంత అత్యవసరమైనా సరే రైలు వెళ్లిపోయి గేటు ఎత్తేంత వరకు ఆగక తప్పని పరిస్థితి ఉండేది. దీంతో అక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. పలుమార్లు ఆందోళనలను సైతం చేపట్టారు. అసెంబ్లీ, పార్లమెంట్ వంటి ఎన్నికలు జరిగిన ప్రతిసారి రాజకీయ పార్టీలు సైతం ఇదే ప్రధాన హామీగా ఎన్నికలకు వెళ్లేవారు. ఇలాంటి పరిస్థితులను దూరం చేసేలా ఏడాదిన్నర కిందట కేంద్రం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆర్‌యుబీతో పాటు ఆర్‌టీఓ ఆఫీసు వద్ద ఆర్‌ఓబీ నిర్మాణాల కోసం రూ.97.20 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో ప్రజల చిరకాల స్వప్నం ఎట్టకేలకు సాకారమవుతుంది.



తాంసి బస్టాండ్ వద్ద ఆర్‌యూబీ నిర్మించనున్న స్థలం

వ్యయం వివరాలు ఇలా..

అంచనా వ్యయం:
రూ.97.20 కోట్లు (పరిపాలన అనుమతి)
రాష్ట్రం వాటా : రూ.57.71 కోట్లు
కేంద్రం వాటా : రూ.39.49 కోట్లు
సాంకేతిక అనుమతి : రూ. 87.02 కోట్లు

రూ.27.63 కోట్లతో ఆర్‌అండ్‌బీ పనులు

ఆర్‌యూబీ, ఆర్‌వోబీ కోసం రెండు చోట్ల భూసేకరణ చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు వాటి వద్ద కొంతమేర కట్టడాలను సైతం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు రూ.27.63 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం రైల్వే పోర్షన్ పనులు సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ పనులు చేపట్టాలంటే భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆర్‌అండ్‌బీ అధికారులు కొలతలు వేసి మార్కింగ్ వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే ఈ పనులను ఆశాఖ అధికారులు చేపట్టనున్నారు.

ప్రారంభమైన పనులు

ఇప్పటికే స్పిన్నింగ్ మిల్లు వద్ద గల ఎల్‌సీ గేట్ 29 వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) పనులు చేపడుతున్న హైదరాబాద్‌కు చెందిన మెహర్ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ తాంసి బస్టాండ్ వద్ద గల ఎల్‌సీ గేట్ 30 వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనులను ప్రారంభించింది. మహాలక్ష్మివాడ వద్ద గల ఆర్‌యూబీ నుంచి ప్రధాన రోడ్‌పైకి, ఎల్‌సీ గేట్ 29 వద్దకు రాకపోకలను దారి మళ్లించారు. రైల్వే ట్రాక్ వద్ద ఉన్న చెట్లను తొలగించి ట్రాక్టర్లతో తరలించారు. రైల్వే ట్రాక్ కింది భాగాన భూగర్భంలో 18 ఫీట్ల డబుల్ లైన్ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే సిద్ధం చేసిన ప్రీకాస్ట్ బాక్స్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో మార్గంలో 8 బాక్స్‌ల చొప్పున 16 ప్రీకాస్ట్ బాక్స్‌లను బిగించనున్నారు. 12 మీటర్ల లోతులో వాటిని ఏర్పాటు చేయనున్నారు. ట్రాక్ నుంచి రెండువైపులా 47 మీటర్ల మేర ఈ పనులు సాగనున్నాయి.

భూసేకరణ చేయాల్సి ఉంది

తాంసి బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జికి సంబంధించి రైల్వే పోర్షన్ పనులను కాంట్రాక్టర్ చేపడుతున్నారు. వాటితో మాకు ఎలాంటి సంబంధం లేదు. ఆర్‌యూబీ పూర్తయ్యాక, రోడ్డు, రిటైనింగ్ వాల్స్‌ను మేము నిర్మించాల్సి ఉంటుంది. అందుకోసం అవసరమైన భూ సేకరణకు మార్కింగ్ ఇచ్చాం. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పనులు చేపడుతాం.

– సురేష్ రాథోడ్, ఆర్‌అండ్‌బీ డీఈ, ఆదిలాబాద్

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం... ప్రజాధనం వృథా



ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి పాత జాతీయ రహదారి నుంచి జైనథ్ మండలం నిరాల వరకు రూ.44.25 కోట్ల వ్యయంతో డబుల్ లైన్ రోడ్డు మంజూరైంది. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని విద్యుత్ శాఖ అధికారులకు తెలిసినప్పటికీ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేలా పాత రోడ్డుకు ఆనుకునే కొత్త విద్యుత్ స్తంభాలతో లైన్ ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణం నుంచి లాండసాంగ్వీ వరకు ఏర్పాటు చేసిన ఈలైన్‌ను తాజాగా చేపట్టనున్న రోడ్డు నిర్మాణంతో తొలగించాల్సి వస్తోంది. దీంతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా కానుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

క్లుప్తంగా

బుడుందేవుకు మెస్రం వంశీయుల పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ

ఉట్నూర్‌రూరల్: కెస్లాపూర్ నాగోబా జాతర అనంతరం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే బుడుందేవు జాతరలో గురువారం మెస్రం వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఇళ్లకు తిరుగు పయణమయ్యారు.. అలాగే ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు ఎంపీపీ తెలిపాడు. కార్యక్రమంలో మెస్రం వంశీయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

25వ సారి రక్తదానం


నవీన్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న వైద్యవిధాన పరిషత్ సిబ్బంది

నిర్మల్‌ఖిల్లా: రక్తం అవసరమై ఆపదలో ఉన్నారని తెలిస్తే చాలు.. రక్తదానం చేసి ప్రాణాలు నిలబెడుతూ యువతలో స్ఫూర్తి నింపుతున్నాడు. అలా ఒకసారీ రెండుసార్లు కాదు ఏకంగా 25 సార్లు రక్తదానం చేసి నిర్మల్ రూరల్ మండలం వెంగ్వాపేట్ గ్రామానికి చెందిన కొప్పుల నవీన్ తన ఉదార స్వభావాన్ని చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. రక్తదాతల వాట్సాప్ సమూహంలో రక్తం అవసరం ఉందని సందేశం రాగానే స్పందిస్తాడు.గురువారం జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో హుస్సేన్ బేగంకు 'ఓ పాజిటివ్' రక్తం అత్యవసరమని గ్రూపులో సమాచారం రాగానే స్పందించి రక్తదానం చేశాడు. నవీన్‌కు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో వైద్యవిధాన పరిషత్ సిబ్బంది ప్రశంసపత్రాన్ని అందించి అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రామాయి గ్రామంలోని ఓ వ్యవసాయ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని రాగి తీగలను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు గురువారం ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడమే కాకుండా అందులోని రూ.10వేల వరకు విలువైన రాగి తీగలను దొంగలించినట్లు పేర్కొన్నారు.

నర్సరీల్లో మొక్కల రక్షణకు ప్రత్యేక చర్యలు

లక్ష్మణచాంద: గ్రామాల్లోని హరిత నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. మండల కేంద్రంలోని నర్సరీని గురువారం తనిఖీ చేశారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. తొలిసారి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చిన జెడ్పీసీఈవోను సిబ్బంది సన్మానించారు. డిప్యూటీ సీఈవో శంకర్ ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో నసీరుద్దీన్, నాయకులు రమేశ్, సురేశ్ ఉన్నారు.

కొలువు సాధించారు..

పోలీస్ శాఖ ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యువత సత్తా చాటారు. పట్టువదలకుండా... నిరాశకు లోనుకాకుండా శ్రమించి ప్రభుత్వ కొలువు సాధించారు. పోలీస్ కావాలనే తపనను సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించి విజయం కైవసం చేసుకున్నారు. పోలీస్ ఉద్యోగం సాధించిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..



డ్రైవర్ నుంచి కానిస్టేబుల్‌గా..



నేరడిగొండ: ప్రభుత్వ కొలువు సాధించాలనే తన తపన నాల్గోసారికి నెరవేరింది. తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. ఓ ప్రైవేట్ వాహనంపై డ్రైవర్‌గా పనిచేస్తూ పోలీసు పరీక్షలకు సన్నద్ధమయ్యాను. మూడుసార్లు విఫలమైనా నిరుత్సాహపడకుండా ముందుకు సాగాను. నాల్గోసారి కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను.

సుద్దల స్వామి, నేరడిగొండ

తండ్రి కష్టాన్ని చూసి.. తల్లి మరణాన్ని దిగమింగి

సిరికొండ: చిన్నప్పటి నుంచి తండ్రి పడుతున్న కష్టాన్ని చూసి.. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే కసితో ఉద్యోగానికి సిద్ధమవుతున్న తరుణంలో వారి తల్లి అనారోగ్యంతో తనువు చాలించింది. దీంతో వారికి కష్టాలు రెట్టింపయ్యాయి. తల్లి లేదనే దుఃఖాన్ని దిగమింగి ప్రభుత్వ నోటిఫికేషన్ రావడంతో పట్టణబాట పట్టారు ఆ ఇద్దరు అన్నదమ్ములు. పట్టుదలతో చదివి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వారే మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన రాథోడ్ మోతిలాల్-లక్ష్మీబాయి దంపతుల కుమారులు రాథోడ్ నాందేవ్(సీవిల్), చిన్న కుమారుడు రాథోడ్ అర్జున్ (ఏఆర్).

– అన్నదమ్ములు రాథోడ్ అర్జున్, నాందేవ్

అమ్మ ధైర్యం చెప్పింది..



కుంటాల: మానాన్న ఎనిమిదేళ్ల క్రితం చనిపోయాడు. మా అమ్మ బీడీలు చుడుతూ ధైర్యం చెప్పి నన్ను చదివించింది. డిచ్‌పల్లి తెలంగాణ యూనివర్సిటీలో ఎంకాం ద్వితీయ సంవత్సరం చదువుతుండగానే సివిల్ కానిస్టేబల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను.

– గడ్డం సంధ్యారాణి, కుంటాల

కష్టపడి చదివించారు..



కుంటాల: నాకు తెలిసి తెలియని వయసులో మా నాన్న చనిపోయారు. అమ్మ, అమ్మమ్మలు కలిసి కూలీ పనిచేశారు. నన్ను ఇష్టంగా చదివించారు. వారి కష్టాలను తొలగించేందుకు కష్టపడి చదివాను. ప్రస్తుతం ఉద్యోగం రావడంతో వారు సంతోషపడ్డారు. ఆనందంగా ఉంది.

– అరిగెల సోనీ, కల్లూర్

ప్రమాదం జరిగినా పట్టు వదలకుండా..



సిరికొండ: పోలీస్ ఉద్యోగంపై ఉన్న మక్కువ ప్రమాదం జరిగినా పట్టువదలనివ్వలేదు. మండల కేంద్రానికి చెందిన ఎగ్గిడి ఇస్తారి-రుక్మిణి దంపతుల పెద్ద కుమారుడు ఎగ్గిడి మహేష్ 2016లో ప్రభుత్వం వేసిన పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాను. కానీ ప్రమాదవశాత్తు జరిగిన ఓ సంఘటనతో రిక్రూట్‌మెంట్‌కు వెళ్లలేకపోయాను. అయినప్పటికీ నిరాశ చెందకుండా చదివాను. తండ్రి కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ నన్ను చదివించాడు. వ్యవసాయ పనులు చేస్తూనే చదువుకున్నాను. నోటిఫికేషన్ రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి కష్టపడి ఇష్టమైన పోలీసు కొలువును సాధించాను.

- ఎగ్గిడి మహేష్

రెండో ప్రయత్నంలోనే...



కుంటాల: వ్యవసాయ భూమిలేక నాన్న కౌలుకు తీసుకొని కష్టపడి నన్ను చదివించారు. విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనే పూర్తిచేశాను. ఉపాధ్యాయ వృత్తి కోర్సు చేస్తుండగా ఉద్యోగానికి ఎంపికయ్యాను. 2018లో ఉద్యోగం రాక నిరాశకు గురయ్యాను. రెండో ప్రయత్నంలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

– గీత్ కుమార్, అంబుగామ

నిరుపేద కుటుంబం నుంచి..



చెన్నూర్: మా నాన్న దాసరి స్వామి ఆనారోగ్యంతో మృతి చెందాడు. తల్లి శ్యామల కూలీ పని చేసి నన్ను చదువించింది. కుటుంబ పోషణ బాధ్యతలు తీసుకోవాలని కష్టపడి చదివాను. ఎస్సై, కానిస్టేబుళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నా. కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను. ప్రస్తుతం మా కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగం అవసరం. గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతా.

– దాసరి వినోద్, చెన్నూర్

డిగ్రీ పూర్తయింది..



చెన్నూర్: మా నాన్న ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నారు. నేను డిగ్రీ పూర్తి చేశాను. పోలీసు కానిస్టేబుల్ కోసం దరఖాస్తు చేసుకొన్నా. ఓ పక్క మైదానంలో వ్యాయామం చేస్తూ మరో వైపు పట్టుదలతో చదివాను. నా కష్టానికి ప్రతిఫలం దక్కింది. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. పట్టుదల క్రమశిక్షణతో సాధన చేస్తే ఏదైన సాధ్యమవుతుందన్న దానికి నేనే ఉదాహరణ.

– తోట శ్రీనివాస్, చెన్నూర్

ఆటో నడుపుతూ..



తాంసి: కానిస్టేబుల్ ఉద్యోగం కోసం 2016 నుంచి సన్నద్ధమవుతున్నాను. రెండుసార్లు విఫలమైనప్పటికీ నిరాశ చెందలేదు. మొదటిసారి ఈవెంట్స్‌లో ఉద్యోగం చేజారింది. రెండోసారి రెండు మార్కుల వ్యవధిలో ఉద్యోగం దూరమైంది. ఈ క్రమంలో పెళ్లి కావడంతో కుటుంబ బాధ్యతలు పెరిగాయి. కుటుంబ పోషణ కోసం ఐదేళ్లుగా ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నడుపుతున్నాను. కానిస్టేబుల్ ఉద్యోగ నోటిఫికేషన్ రావడంతో ఆటో నడుపుతూనే ఉద్యోగం సాధించాను. నా భార్య సాకారం మరవలేనిది.

– కుటుంబ సభ్యులతో కిషోర్

పట్టువదలని విక్రమార్కుడు..



ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన మునేశ్వర్ మహేందర్ పట్టువదలని విక్రమార్కుడిలా పోలీసు ఉద్యోగం సాధించాడు. గతంలో రెండుసార్లు ఉద్యోగం కోసం ప్రయత్నం చేశాడు. మొదటిసారి ఎత్తులో, రెండోసారి పరీక్షలో మార్కులు సాధించలేక పోవడంతో ఉద్యోగం రాలేదు. మూడోసారి ఎలాగైన ఉద్యోగం సాధించాలని పట్టుదలతో రాత్రి పగలు సాధన చేసి పోలీసు ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన మహేందర్ ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాడు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాన్ని అందుకున్నాడు.

- మహేందర్

బధిర విద్యార్థులకు వినికిడి పరీక్షలు


పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వినికిడి లోపం ఉన్న 18 ఏళ్లలోపు విద్యార్థులకు గురువారం వి హియర్ సంస్థ, హియర్ న్యూ సంస్థల ఆధ్వర్యంలో వినికిడి పరీక్షలు నిర్వహించారు. జిల్లా విలీన విద్యా సమన్వయ కర్త ఎస్.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. వి హియర్ అనే సంస్థ తమ సామాజిక బాధ్యతగా, హియర్ న్యూ సంస్థతో కలిసి క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినికిడి లోపంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులను గుర్తించి, వారికి వినికిడి యంత్రాలను ఉచితంగా అందిస్తారన్నారు. గుజరాత్ నుండి వచ్చిన హియర్ న్యూ సంస్థ సభ్యులు కుల్దీప్, సాహిల్, జతిన్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 65 మంది హాజరు కాగా, 57 మందికి వినికిడి పరికరాలు అవసరమవుతాయని గుర్తించారు. వీరికి త్వరలో పరికరాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇందులో ఐఆర్పీలు నాగరాజు, నరేష్, రవి, విజయ్, రాజశేఖర్, శ్రవంత్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బౌద్ధులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని బౌద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని భారతీయ బౌద్ధ మహాసభ ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ప్రభాకర్ గడపాలే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో బుద్ధవిహార్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బుద్ధుడి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సామూహిక బౌద్ధవందనం ఆలపించారు. ఇందులో ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞకుమార్, కార్యవర్గ సభ్యులు కాంతారావు, భారత్ గైక్వాడ్, అమ్రపాల, బేబి కానిందే, లలిత, దయానంద్, సురేందర్ ఉన్నారు.

నేడు విద్యార్థుల ర్యాలీ

నిర్మల్ టౌన్: ఆదిలాబాద్ టు ఆర్మూర్ వయా నిర్మల్ రైల్వేలైన్ కోసం రైల్వేలైన్ సాధన కమిటీ శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ లింగన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో గురువారం మాట్లాడారు. జిల్లా కేంద్రంలోనీ ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి చేపట్టే ర్యాలీకి విద్యార్థులు అధిక సంఖ్యలో రావాలని కోరారు. ఇందులో కన్వీనర్ మనోజ్, సాయన్న, గణేశ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య


సూర్యకాంత్ (ఫైల్)

గుడిహత్నూర్: అనారోగ్యంతో మండలంలోని మన్నూర్ ఎస్సీ కాలనీకి చెందిన వాఘ్మారే సూర్యకాంత్(33) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యకాంత్ మిషన్ భగీరథలో వాటర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. గత కొన్ని రోజుల క్రితం కడుపు నొప్పి ఉండగా ఆపరేషన్ చేయించుకున్నాడు. అయినా తగ్గక పోవడంతో బాధను తట్టుకోలేక బుధవారం రాత్రి కాలనీకి దూరంగా ఉన్న స్టోన్ క్రషర్ వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేల నుంచి వస్తున్న వారు గమనించి స్థానికులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వెంటనే రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. కాగా మృతుడికి భార్య కిరణ్, కొడుకు, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముథోల్: మండల కేంద్రంలోని స్థానిక కంటి ఆస్పత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన శివ, శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై భైంసాలోని బంధువుల ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణమయ్యారు. ముథోల్ కంటి ఆసుపత్రి సమీపంలోని గుంతలో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ప్రయాణికులు 108 భైంసా ఏరియాసుపత్రికి తీసుకెళ్లారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

ఆసిఫాబాద్‌అర్బన్: బైక్‌ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... మోతుగూడ గ్రామానికి చెందిన బొట్టుపల్లి చరణ్‌దాస్ జన్కాపూర్‌లోని బాలాజీ జిన్నింగ్ మిల్లులో పత్తిని అమ్మి బయటకు వస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ నుంచి వాంకిడి వైపు వెళ్తున్న బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మంచిర్యాలకు రెఫర్ చేశారు.

ట్రిపుల్‌ఐటీని ప్రక్షాళన చేయండి

- అవినీతిపై విచారణ చేపట్టండి
- రెగ్యులర్ వీసీని నియమించాలి
- గుండెగాం పునరావాసం, బాసర ఆలయం, రైతుల కష్టాలపై మాట్లాడిన ఎమ్మెల్యే పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా: శాసన సభ్యుడి హోదాలో రామారావు పటేల్ మొట్టమొదటి సారిగా అసెంబ్లీలో గురువారం తన గళాన్ని వినిపించారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు చెబుతు.. మొదటి ప్రసంగంలోనే అవినీతిపై దుయ్యబట్టారు. ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీకి అవినీతి చెదలు పట్టాయని, ప్రక్షాళన చేయాలని స్పీకర్ సమక్ష్యంలో తెలియజేశారు. గత ఎనిమిదేళ్లుగా ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అవినీతికి పాల్పడిన వీసీని తొలగించాలని చెప్పారు. 8700 మంది విద్యార్థులున్న ట్రిపుల్‌ఐటీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. డైరెక్టర్‌కు ఎలాంటి అధికారాలు ఇవ్వక పోవడంతో పాలన కుంటుపడిందని, 18 నెలలుగా వీసీ పర్యవేక్షణ లేదన్నారు. కళాశాలల్లోని తరగతి గదుల్లో విద్యార్థులకు సెల్‌ఫోన్లు అనుమతి ఇవ్వవద్దని, ఈ నిబంధనను పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. హాస్టల్‌లోని ఒక్కో రూములో ముగ్గురు బాలికలు ఉండడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. యూనివర్సిటీలో గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు పెరిగిపోయాయన్నారు. హాస్టల్లోని బాత్‌రూం సరిగ్గా లేవని, భోజన వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. రూ. 12కోట్లతో సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసిన ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని, దీనిపై విచారణ జరపాలన్నారు. 14 ఏళ్లుగా భవనాలకు పెయింటింగ్ వేయకపోవడంతో అధ్వానంగా మారిందన్నారు. అదే విధంగా విద్యార్థులకు ల్యాప్ ట్యాబ్లు పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వం బాసర ఆలయ పునర్నిర్మాణానికి రూ. 50కోట్లు ఇచ్చినట్టే ఇచ్చి రూ.42 కోట్లను వెనక్కి తీసుకుందని తక్షణమే నిధులు మంజూరు చేసి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు మూలంగా గుండెగాం వాసులు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారని, పునరావాసం కింద కేవలం కాగితాలకు మాత్రమే గత ప్రభుత్వం రూ. 90కోట్లు మంజూరు చేసినా ఇప్పటి వరకు బాధితులకు ఎలాంటి న్యాయం జరుగలేదన్నారు. తానూర్ మండలంలో వడగాళ్ల వానతో వెయ్యికి పైగా ఎకరాల్లో నష్టం జరిగిందని, సర్వే చేయించి రైతులను పరిహారం ఇవ్వాలన్నా రు. అసెంబ్లీలో తాను వివరించే నియోజకవర్గ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కడెం ప్రాజక్టును గాలికొదిలేశారు

వెనుకబడిన మా ఆదిలాబాద్ ప్రాంతాన్ని అన్ని రంగంల్లో విస్మరించారు. నా ఖానాపూ ర్ నియోజకవర్గంలో అన్నీ సమస్యలే. ప్రధాన నీటి వనరు కడెం ప్రాజెక్టు మరమ్మతులు గత ప్రభుత్వం గాలికొదిలేసింది. నాటి మంత్రి కేటీఆర్‌కు అసలు ఆ ప్రాజెక్టు ఎక్కడుందో కూడా తెలియని దుస్థితి. మిషన్ భగీరథ లోపాలతో గిరిజన గూడేలు మంచినీటికి ఇబ్బంది పడుతున్నాయి.

– ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఖానాపూర్

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య

- ఆస్పత్రి వద్ద కుటుంబీకుల ఆందోళన


తిరుమలేశ్(ఫైల్)

ఖానాపూర్: అప్పులబాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై లింబాద్రి వివరాల ప్రకారం.. పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని పస్పుల(గాండ్ల) తిరుమలేశ్ (47) గురువారం ఉదయం శాంతినగర్ శివారులో పురుగుల మందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో అపస్మారక స్థితిలో ఉన్న తిరుమలేశ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనతంరం నిర్మల్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. తిరుమలేశ్ పెద్దకూతురుకి రెండేళ్ల క్రితం వివాహం చేశాడు. ఆ సమయంలో అప్పులతో పాటు ఇతర అప్పులు కలిపి మొత్తం రూ.35 లక్షలున్నాయి. వాటిని తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తిరుమలేశ్‌కు భార్య రాజమణి, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన...

తిరుమలేశ్‌కు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సకాలంలో వైద్యం అందకపోవడంతోనే మృతి చెందాడని కుటుంబీకులు, బంధువులతో పాటు స్థానిక నాయకులు విమర్శించారు. గురువారం ఆస్పత్రి వద్ద ఆందోళన చేయడంతో పాటు వైద్య అధికారులను నిలదీశారు. ఆసుపత్రిలో వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో పాటు శానిటేషన్ సిబ్బందితో చికిత్సలు చేయించారని ఆరోపించారు. ఖానాపూర్‌లో పేరుకే పెద్దాసుపత్రిగా ఉన్నప్పటికీ కనీస వైద్య సేవలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. తిరుమలేశ్ మృతి చెందిన తీరుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బక్కశెట్టి కిశోర్, బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, శివ ఉన్నారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

కొనసాగుతున్న నాగోబా జాతర

- అధికారికంగా ముగింపు...
- అనధికారికంగా ఇంకో రెండు రోజులు కొనసాగనున్న జాతర


నాగోబా దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఈ నెల 09న మెస్రం వంశీయుల మహాపూజలతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. గురువారం అధికారికంగా నాగోబా జాతర ముగిసినా... అనధికారికంగా మరో రెండు రోజులు కొనసాగుతుందని దేవాదాయ శాఖ ఈవో రాజమౌలి తెలిపారు. గురువారం కూడా ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి గంటల తరబడి క్యూలో ఉండి నాగోబా దర్శనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేసిన భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇంటికి కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. రంగుల రాట్నాల వద్ద యువతి, యువకలతో సందడి వాతావరణం నెలకొంది. జాతరలో ఎలాంటి ఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.